పీఎం కిసాన్ అర్హతపై ఆరా


పీఎం కిసాన్ యాప్‌లో లబ్ధిదారుడి వివరాలు అప్‌లోడ్ చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

- లబ్ధిదారుల జాబితాపై అధికారుల విచారణ
- ఐదు శాతం పరిశీలించాలని ఆదేశాలు
- క్లస్టర్ పరిధిలో 2,768 మంది లబ్ధిదారుల పరిశీలన

రాయవరం: ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్) పథకం లబ్ధిదారుల్లో అనర్హులను గుర్తించే పనిలో ప్రభుత్వం నిమగ్నమైంది. రెండేళ్లకు గాను లబ్ధిదారుల్లోని ఐదు శాతం మంది వివరాలను పరిశీలించి ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. వారి జాబితాను ప్రభుత్వమే సిద్ధం చేసి అధికారులకు అందజేసింది. ప్రస్తుతం ఈ ప్రక్రియ జిల్లాలో ముమ్మరంగా సాగుతోంది.

2019 నుంచి పథకం అమలు

పీఎం కిసాన్ పథకం కింద రైతులను ఆదుకునేందుకు 2019 నుంచి కేంద్ర ప్రభుత్వం ఏటా రూ.6 వేల చొప్పున అందిస్తోంది. ఖరీఫ్ ప్రారంభం, కోతలు, రబీ ప్రారంభంలో విడతకు రూ.2 వేల చొప్పున అర్హుల ఖాతాల్లో జమ చేస్తోంది. ప్రస్తుత సీజన్‌కు గాను మొదటి విడతగా జూన్ 18న తొలి విడత సాయం అందజేసింది.

క్లస్టర్ పరిధిలో ఇదీ పరిస్థితి

మండలం	2022-23	2023-24
	1 2 3	1 2 3
మండపేట	221-126-95	253-138-115
రామచంద్రపురం	278-194-84	313-199-114
కపిలేశ్వరపురం	296-217-79	339-250-89
రాయవరం	196-139-57	220-168-52
కె.గంగవరం	296-238-58	356-248-108

1. ఐదు శాతం సర్వే చేయవలసిన వారు
2. ఇంతవరకూ సర్వే పూర్తయిన వారు
3. ఇంకా చేయవలసిన వారు

ప్రత్యేక సర్వే

పథకం అమలులో భాగంగా గతంలో తొలి విడత సాయం విడుదలకు ముందు ఏటా లబ్ధిదారుల బయోమెట్రిక్ తీసుకుని ఈకేవైసీ చేయించేవారు. దీని వలన భౌతికంగా ఉన్న వారికి మాత్రమే ప్రభుత్వ లబ్ధి అందుతుంది. లబ్ధిదారుల్లో అనర్హులు ఉంటే వారిని గుర్తించి తొలగించేందుకు ప్రత్యేక సర్వే నిర్వహిస్తుంది. గతంలోనూ అనర్హులను గుర్తించి తొలగించారు. అందులో భాగంగా ఈ ఏడాది అనర్హులను గుర్తించేందుకు చర్యలు చేపట్టింది. 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో పీఎం కిసాన్ పథకం కింద లబ్ధి పొందిన వారి వివరాలను పరిశీలిస్తోంది. రెండేళ్లలో లబ్ధిదారుల నుంచి ఐదు శాతం చొప్పున 2022-23లో 1,287 మంది, 2023-24లో 1,481 మంది రైతుల వివరాలతో జాబితాను సిద్ధం చేసి వ్యవసాయ శాఖకు అందజేసింది. ఈ మేరకు ఆ లబ్ధిదారులు భౌతికంగా ఉన్నారా? లేదా? అర్హులా? కాదా ? తదితర వివరాలు సేకరించే పనిలో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారు. అయితే ఇప్పటి వరకు క్లస్టర్ పరిధిలో 2122-23 సంవత్సరానికి 914 మంది 2023-24 సంవత్సరానికి 1,003 మంది లబ్ధిదారుల ఫొటో తీసి పీఎం కిసాన్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. తాజా పరిశీలనలో లబ్ధిదారుల్లో కొందరు మృతి చెంది ఉండటం, భూమి బదలాయింపు, విదేశాలకు వెళ్లిపోవడం వంటి అంశాలు వెల్లడవుతున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

త్వరితగతిన సర్వే



గత రెండేళ్లలో పీఎం కిసాన్ లబ్ధిదారుల నుంచి ప్రభుత్వం విడుదల చేసిన జాబితా మేరకు పరిశీలన చేస్తున్నాం. వ్యవసాయ శాఖ సిబ్బంది లబ్ధిదారుల వద్దకు వెళ్లి వివరాలు సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేస్తు న్నారు. ఇప్పటికే జిల్లాలో 70 శాతం మేర పరిశీలన పూర్తయ్యింది. లబ్ధిదారుల్లో కొందరు భూమిని విక్ర యించుకోవడం, విదేశాలకు వెళ్లిపోవడం, మృతి చెందడం వంటివి పరిశీలనలో వెల్లడవుతున్నాయి.

– కొప్పిశెట్టి ప్రభాకర్, ఏవో, రాయవరం

పరిశీలిస్తున్న అంశాలు

- ఆదాయపు పన్ను కడుతున్నవారు ఉన్నారా.. భూమి లేకుండా లబ్ధిదారులు పథకం లబ్ధి పొందుతున్నారా?
- పథకం పొందుతున్న వారిలో ప్రస్తుత, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, శాసనమండలి సభ్యులు, రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారా?
- భూమి వివరాలు సరిపోకపోవడం.
- 2019 తర్వాత భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు.
- ఒక కుటుంబంలో ఒక లబ్ధిదారుడు ఉండగా మరో కుటుంబ సభ్యునికి కూడా పథకం వర్తించడం.
- ఆధార్ నంబర్ మనుగడలో లేకపోవడం.
- రాష్ట్రం నుంచి వలస వెళ్లిపోయిన వారు.
- భూమి సాగు చేయకుండా స్వచ్ఛందంగా వదిలేయడం.
- 18 ఏళ్ల లోపు వయసు ఉన్న వారికి ఎవరికైనా పథకం వర్తిస్తుందా?లేదా? తదితర వివరాలు సేకరిస్తున్నారు.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కాజులూరు: గొల్లపాలెం 333/11 కేవీ విద్యుత్ స్టేషన్ పరిధిలో పలు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ఈపీడీసీఎల్ కాకినాడ డీఈ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం గొల్లపాలెం మెయిన్ సబ్ స్టేషన్ ఏఈ ఎం.సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతులు, ట్రీ కటింగ్ పనుల్లో భాగంగా ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరా నిలిపివేయాల్సి వస్తుందన్నారు. కాజులూరు మండలం గొల్లపాలెం, ఆర్యావటం, బందనపూడి, మొగలిపాలెం, శలపాక, తణుకువాడ, మంజేరు, శీల, శీలలంక, ఒంటితాడి, అంద్రంగి, పెనుమళ్ల, తనుమళ్ల, పెదపాటిగరువు, జగన్నాథగిరి, కరప మండలం కొంగోడు, గొర్రిపూడి, విజయరాయుడుపాలెం, యండమూరు తదితర గ్రామాలకు సరఫరా ఉండదన్నారు. దీనికి ప్రజలు సహకరించాలని కోరారు.

రాయవరం: మండలంలోని పసలపూడి సబ్ స్టేషన్ నిర్వహణ పనుల నిమిత్తం శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్తు సరఫరాను నిలుపుదల చేస్తున్నామని ట్రాన్స్‌కో ఈఈ వై.విజయానంద్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఫలితంగా పసలపూడి, నరాలవారిపాలెం, యర్రపట్టిపురం, కృష్ణమ్మచెరువు, చెల్లూరు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. అలాగే రామచంద్రపురం నుంచి ఆలమూరుకు వెళ్లే 33 కేవీఏ లైన్‌లో మెయింటెనెన్స్ పనులు, ట్రీ కటింగ్ చేపడుతున్నట్లు తెలిపారు. ఫలితంగా వెంటూరు, కురకాళ్లపల్లి, కూర్మాపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

ఓఆర్ఎస్ ప్రాధాన్యం గుర్తించాలి


అంగర సచివాలయంలో ఓఆర్ఎస్ ద్రావణాన్ని అందజేస్తున్న సర్పంచ్ కోటేశ్వరరావు

కపిలేశ్వరపురం: ఓఆర్ఎస్, జింక్ కార్నర్ల ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని స్టాప్ డయేరియా కార్యక్రమాల్లో వైద్య ఆరోగ్య కార్యకర్తలు అన్నారు. మండలంలోని అంగర, వాకతిప్ప, అచ్యుతాపురం పీహెచ్‌సీల ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామాల్లో అతిసారంపై ప్రజలకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యాలయాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా అందజేశారు. అతిసార వ్యాధి లక్షణాలను వివరించారు. పరిస్థితి విషమించకుండా వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

20న కపిలేశ్వరపురం మండల సమావేశం

కపిలేశ్వరపురం: స్థానిక మండల పరిషత్ పాలకవర్గ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కొండలరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశ మందిరంలో సమావేశం ప్రారంభం అవుతుందన్నారు.

మధ్యాహ్న భోజనంలో హాజరు పెరగాలి


గొల్లపాలెం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న నాగేశ్వరరావు

కాజులూరు: మధ్యాహ్న భోజనంలో హాజరు శాతాన్ని పెంచేందుకు ఇంప్లిమెంట్ ఏజెన్సీలు శ్రద్ధ చూపాలని కాకినాడ విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం గొల్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆయన ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో కలసి భోజనం చేశారు. పాఠశాలకు 400 మంది విద్యార్థులు హాజరుకాగా కేవలం 179 మంది మాత్రమే భోజనం చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ హాజరు పెంచేలా నిర్వాహకులు, ఉపాధ్యాయులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం తరగతి గదులు, ఆర్వో ప్లాంటు, న్యూట్రీ గార్డెన్, శానిటేషన్‌ను పరిశీలించి సంతృప్తిం వ్యక్తం చేశారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థిని ఎంపిక


ఓరుగంటి నాగమణి

కె.గంగవరం: స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థిని ఓరుగంటి నాగమణి ట్రిపుల్ ఐటీకి అర్హత సాధించింది. ఇటీవల పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు పొందిన ఆమె శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు ఎంపికైంది. ఆమెను ఎంఈఓ నాగరాజు, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా శ్రీరామనామ సప్తాహం


బాబూరావు, సత్యవతి దంపతులను సత్కరిస్తున్న ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం సభ్యులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం ఆధ్వర్యంలో 7వ శ్రీరామనామ సప్తాహం కొనసాగింది. శుక్రవారం నాలుగో రోజు వీనుల విందైన సంగీతంతో ప్రేక్షకులను అలరించారు. అమలాపురానికి చెందిన మట్టపర్తి చంద్రశేఖర్ భజన బృందం, చిరుతపూడికి చెందిన రాజేష్ స్వామి భజన బృందం, రాజమహేంద్రవరం, దంగేరుకు చెందిన శ్రీలలితా పరమేశ్వరి మహిళా బృందం, ఏడునూతుల మురళీ, శ్రీలక్ష్మీ శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో గంగవరానికి చెందిన శ్రీరామ భక్తాంజనేయ బాలభక్త సమాజం తమ భక్తి గీతాలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. అనంతరం వేగాయమ్మపేటకు చెందిన దాత ఆదిమూలం బాబూరావు, సత్యవతి దంపతులు శ్రీలలితాపరమేశ్వరి మహిళా భజన బృందానికి పారితోషికం అందజేసి వారిని సత్కరించారు. ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం సభ్యులు గరగ బాబూరావు, ఏలూరి ప్రసాద్‌లు దాతల దంపతులకు స్వామివారి జ్ఞాపిక అందజేశారు. ద్రాక్షారామ, పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి

- అధికారులకు ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ ఆదేశం
- మండల సమావేశంలో పలు సమస్యలపై చర్చ


మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసు

మండపేట: వర్షాకాలం ప్రవేశించినందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ సంబంధిత అధికారులకు సూచించారు. మండపేట మండల పరిషత్ పాలకవర్గ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో నిర్వహించారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఉప సర్పంచులతో పాటు పలు శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను సభ్యులు లేవనెత్తారు. ఏడిద సీతానగరం సర్పంచ్ వరదా చక్రవర్తి మాట్లాడుతూ ఏడిద నుంచి తమ గ్రామమైన సీతానగరానికి వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారిందన్నారు. రోజూ ఏడు స్కూల్ బస్సులు గ్రామానికి రాకపోకలు సాగిస్తాయని, బస్సుల్లో ప్రయాణించేటపుడు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున మరమ్మతులు చేపట్టాలని కోరారు. వెలగతోడు కాలువలో పూడిక పెరిగిపోయి ఆయకట్టు భూములకు నీరు అందడం కష్టంగా ఉందని వెలగతోడు ఎంపీటీసీ సభ్యుడు దుర్గారావు సభ దృష్టికి తెచ్చారు. గతంలో ఉపాధి కూలీలతో ఈ కాలువను బాగు చేసేవారని, ఇప్పుడు ఆ పనులు అరకొరగా చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. దీనిపై మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ మాట్లాడుతూ ఏడిద రైతులు తమ పరిధిలోని కాలువ పూడికతీత పనులు తామే చేసుకున్నారన్నారు.ఆ గ్రామ రైతులను ఆదర్శంగా తీసుకుని తోటి రైతులు కాలువ పూడికతీత పనులు మొదలు పెడితే మండల నిధులను కూడా వెచ్చిస్తామన్నారు. వేములపల్లిలో గృహ లబ్ధిదారులు వేగంగా పనులు చేపట్టేలా చర్యలు చేపడుతున్నామని హౌసింగ్ ఏఈ దాసు తెలిపారు. పంటలు వేసిన తర్వాత ఆ వివరాలను కౌలు రైతులు నమోదు చేయించుకుంటే కౌలు కార్డులు జారీ చేస్తామని ఏవో ఏసుబాబు చెప్పారు. మండలంలోని మొత్తం 16,200 ఎకరాల విస్తీర్ణంలో ఇప్పటి వరకూ 8 వేల ఎకరాల్లో వరినాట్లు వేసినట్టు తెలిపారు. మండలానికి వచ్చిన యూనిఫాం, పుస్తకాలు, షూలను ఆయా పాఠశాలలకు పంపించినట్టు ఎంఈవో సోమిరెడ్డి తెలిపారు. స్కూల్ బాగ్స్ రావాల్సి ఉందన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు నివారణ చర్యలు తీసుకుంటున్నట్టు కేశవరం పీహెచ్‌సీ డాక్టర్ లత తెలిపారు. ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్నామని, గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్నామని చెప్పారు. డయేరియా లక్షణాలు ఉన్న వారిని గుర్తించి మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీదేవి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పనుపర్తి నాగబాబు, ఈవోపీఆర్డీ ఐదం రాజు తదితరులు పాల్గొన్నారు.

కృత్తివెంటి విద్యార్థికి ఫ్రీ సీటు


మంతిన సాయిపూజిత్

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురంలోని శ్రీకృత్తివెంటి పేర్రాజు పంతులు జూనియర్ కళాశాల విద్యార్థి మంతిన సాయిపూజిత్ అమరావతి విట్ ఇంజినీరింగ్ కళాశాలలోని డేటా సైన్స్ ఇంజినీరింగ్‌లో ఫ్రీ సీటు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా డీఐఈఓ వనుము సోమశేఖరరావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వ కళాశాలల్లో చదివిన విద్యార్థుల్లో ప్రతిభ ఆధారంగా జిల్లాకు ఒక్కరు చొప్పున అవకాశం కల్పించగా, మన జిల్లా నుంచి రామచంద్రపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి 961/1000 మార్కులు సాధించిన సాయిపూజిత్‌కు అవకాశం దక్కిందన్నారు. రాయవరం మండలం చెల్లూరు గ్రామానికి చెందిన అతని తండ్రి సత్యనారాయణ వెల్డింగ్ వర్కర్‌గా పని చేస్తున్నారని, తల్లి ఉమామహేశ్వరి గృహిణి అని ఆయన తెలిపారు. విద్యార్థిని ప్రిన్సిపాల్ సోమశేఖరరావు, అధ్యాపకులు అరుణోదయ కుమార్, జంపని రఘురామ్, చక్రధర్, సుబ్బారావు, హుస్సేన్, ఎం.రామారావు, కల్పన, సునీత, వెంకటేష్, ప్రసాద్, లావణ్య, అనుపమ, శ్రీదేవి, సత్యవాణి తదితరులు అభినందించారు.

పంజాబ్ స్కూల్లో అర్తమూరు విద్యార్థికి సీటు


గుమ్మడి ధీరజ్

మండపేట: మండలంలోని అర్తమూరుకు చెందిన మాజీ సైనికుడు గుమ్మడి అనిల్‌కుమార్ కుమారుడు గుమ్మడి ధీరజ్ పంజాబ్ రాష్ట్రం, పఠాన్‌కోట్‌లోని ప్రతాప్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఉచిత ఇంటర్మీడియట్ సీటు సాధించాడు. టెన్త్ పూర్తయిన అనంతరం ధీరజ్ ఎన్‌టీఏ ద్వారా కేంద్ర ప్రుభుత్వ పథకంగా ఉన్న శ్రేష్ఠ ఎగ్జామ్ రాశారు. ఆ ఫలితాలు శుక్రవారం వెలువడడంతో అందులో ఆల్ ఇండియా ర్యాంకు సాధించినట్టు ధీరజ్ తండ్రి అనిల్ తెలిపారు. దేశ వ్యాప్తంగా సుమారు 50 వేల మంది వరకూ ఈ పరీక్ష రాయగా, ధీరజ్‌కు 1330 ర్యాంకు లభించినట్టు చెప్పారు.

నిత్య భగవన్నామ స్మరణులు అర్చకులు


సత్కారం అందుకుంటున్న అర్చకులు

మండపేట: లోక కల్యాణం కోసం నిత్యం భగవన్నామ స్మరణ చేసేది అర్చకుడు ఒక్కరేనని మరిచి డివిజన్ అధ్యక్షుడు పెద్దింటి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మరిచి మహాఋషి తిరు నక్షత్రం సందర్భంగా పట్టణంలోని రథం గుడి ప్రాంగణంలో జనార్దన స్వామివారి ఆలయ అర్చకుడు ఖండవల్లి గోపాలకృష్ణమాచార్యులు, భార్గవాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీవైఖానస మరిచి డివిజన్ సంఘ కార్యదర్శి పెదపూడి సీతారామం మాట్లాడుతూ ఆలయాల్లో సాంప్రదాయబద్ధంగా అర్చనలు, కైంకర్యాలు నిర్వహించి ఆలయ వైభవాలను మరింత పటిష్టపరచాలని కోరారు. భగవతారాధన గురించి సంఘ కోశాధికారి పెద్దింటి మురళి వివరించారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి చక్రవర్తుల గోపి, ఆగమ సలహాదారులు పెదపూడి లక్ష్మీజనార్దన మూర్తి, సుదర్శనం దొరబాబు కూడా ప్రసంగించారు. సంఘం తరఫున పలువురు అర్చకులను సత్కరించారు. ఎనిమిది మండలాల అధ్యక్ష కార్యదర్శులు, సుమారు 500 మంది వైఖానస అర్చకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు, విద్యా సామగ్రి అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

రామచంద్రపురం: స్థానిక వైఎస్సార్ నగర్‌లో బీఆర్ అంబేడ్కర్ పురపాలక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం 60 మంది విద్యార్థులకు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఉచితంగా నోటు పుస్తకాలు, విద్యా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ మాట్లాడుతూ దాతలైన ద్రాక్షారామ శంకర్‌నారాయణ, బాలాజీ బుక్ షాపు, రామచంద్రపురం లావణ్య, సరస్వతి బుక్ షాపులు, హెల్పింగ్ స్మైల్ పలివెల వెంకట్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం మాట్లాడుతూ మహనీయులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, అబ్రహం లింకన్, నెల్సన్ మండేలా స్ఫూర్తితో విద్యార్థులు చదువుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాదా శ్రీరాములు, ఉపాధ్యాయులు జీవీ హనుమాన్, జి.కృష్ణ, జీవీఎల్ ప్రసన్న, పీవైఎల్ అంబటి కృష్ణ, పీడీఎస్‌యూ నాయకులు కరిపోతుల నవీన్, చింతా రాజారెడ్డి, ఎస్.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

న్యాయవాదులకు వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న న్యాయమూర్తులు

రాజోలు: స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి, జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు తదితరులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పని ఒత్తిడిలో ఆరోగ్యంపై శ్రద్ధ చూపకపోవడంతో తీవ్రమైన అనర్థాలకు గురవుతున్నారని న్యాయమూర్తులు పేర్కొన్నారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన బార్ అసోసియేషన్ ప్రతినిధులను అభినందించారు. అమలాపురం మెడ్ యునైటెడ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు చేశారు.

వైభవంగా వారాహి పూజా మహోత్సవం


చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు


దాత దంపతులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

మామిడికుదురు: నగరం మొల్లేటివారి మెరకలోని విజయ దుర్గమ్మ ఆలయం వద్ద శుక్రవారం వారాహి అమ్మవారి నవరాత్ర పూజా మహోత్సవం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా కనకదుర్గమ్మను పలు రకాల కూరగాయలతో అలంకరించారు. అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. కుంకుమార్చనలు, చండీ హోమం తదితర పూజలను ఏవీఎస్ సుబ్రహ్మణ్యం శర్మ ఆధ్వర్యంలో శేషుకుమార్‌శర్మ, సాయిశర్మ జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మ వారిని దర్శించుకున్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి సన్నిధిలో నిత్యాన్నదాన ట్రస్టుకు ముమ్మిడివరానికి చెందిన నలమల కొండలరావు, వీరలక్ష్మి దంపతులు శుక్రవారం రూ.10 వేలు విరాళంగా సమర్పించారు. ఈ విరాళాన్ని ఆలయ ఉద్యోగులకు ఇచ్చారు. దాత దంపతులకు ఆలయ అర్చకులు స్వామివారి వేదాశీర్వచనం అందించారు. అనంతరం స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను ఇచ్చారు.

పొలంబడులను సద్వినియోగం చేసుకోండి



శీలలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏడీఏ బాబూరావు

కాజులూరు: సాగులో అధిక దిగుబడులు సాధించేందుకు రైతుల కోసం గ్రామాల్లో నిర్వహిస్తున్న పొలం బడులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కరప సబ్ డివిజన్ ఏడీఏ కె.బాబూరావు తెలిపారు. శుక్రవారం శీల గ్రామంలో సర్పంచ్ కోమలి వెంకటరమణ అధ్యక్షతన రైతుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగులో తొలిదశ నుంచీ యంత్ర పరికరాలను వినియోగించడం వల్ల పెట్టుబడులు తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. దీనిపై పొలంబడిలో దశలవారీగా సూచనలు అందిస్తామన్నారు. మండల వ్యవసాయాధికారి వి.అశోక్, వీఏఏ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానం కోసమే విహారయాత్రలు



విహారయాత్రకు వెళ్తున్న కాజులూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

కాజులూరు: విద్యార్థులకు వినోదంతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించేందుకు విహారయాత్రలు దోహదపడతాయని కాజులూరు జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం పంపన కృష్ణమూర్తి అన్నారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం కాజులూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులను విహారయాత్రకు తీసుకువెళ్లారు. రామచంద్రపురం ఆర్టోస్ పరిశ్రమకు తీసుకువెళ్లి కంపెనీలో తయారయ్యే పలు రకాల ఉత్పత్తులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు చింతా నారాయణమూర్తి, కేవీవీ సత్యనారాయణ, సుజాత, బాషా, నాగలక్ష్మి, బీఐఎస్ నిర్వాహకులు శామ్యూల్ బెన్‌హర్, హరినాథ్ తదితరులు ఉన్నారు.

దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడాలి

రాయవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు అవమానం చేసే వారి పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించి, దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని దళిత నేత లంక చందు డిమాండ్ చేశారు. రాయవరంలో శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇటీవల రామచంద్రపురం మండలం వెల్ల గ్రామం దళితపేటలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలను ఈ నెల 4న కొందరు ధ్వంసం చేశారన్నారు. ఈ విషయంలో పోలీసులు సకాలంలో స్పందించిన తీరును చందు అభినందించారు. భారత రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికే రక్షణ లేకపోతే దళితులకు రక్షణ ఎక్కడ ఉంటుందని ఆయన ప్రశ్నించారు. దళితులపై ఎక్కడ దాడులు జరిగినా పోలీసులు, ప్రజాప్రతినిధులు సకాలంలో స్పందించాలని కోరారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి


వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సురేష్‌బాబు

రామచంద్రపురం: రోడ్లపై ప్రయాణించే వాహనదారులు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని రామచంద్రపురం ఎస్సై సురేష్‌బాబు సూచించారు. స్థానిక మార్కెట్ సెంటర్ వద్ద శుక్రవారం ఆయన వాహనచోదకులను ఆపి సిబ్బందితో కలసి తనిఖీలు చేశారు. నూతనంగా అమలులోకి వచ్చిన చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు.

గుడ్, బ్యాడ్ టచ్‌లపై బాలికలకు అవగాహన


వల్లూరు పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ప్రమీల

కపిలేశ్వరపురం: విద్యార్థినులకు సామాజిక అంశాలపై అవగాహన అవసరమని మహిళా పోలీస్ గెడ్డం ప్రమీల అన్నారు. మండల పరిధిలోని వల్లూరులోని ఎంపీపీ మోడల్ స్కూల్‌లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అనే అంశంపై బాలికలకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితుడికి సాయం

రావులపాలెం: గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న వ్యక్తికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ. 22 వేల సాయం అందించారు. అమలాపురానికి చెందిన గుత్తుల ఆనంద బాబు గుండె వ్యాధితో బాధపడుతున్నారు. అతనికి ప్రస్తుతం మందులకు ఇబ్బంది రాకుండా ఆ సేవా సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో సాయాన్ని బాధితుడి భార్య పుష్పలలితకు అందించారు.